వీరబ్రహ్మేంద్రస్వామి సేవలో పొలతల భక్తులు

బ్రహ్మంగారిమఠం : మహాశివరాత్రికి పొలతలకు వెళ్లిన భక్తులు అధిక సంఖ్యలో తిరుగు ప్రయాణంలో బ్రహ్మంగారిమఠానికి చేరుకున్నారు. శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి, మాతా గోవింద మాంబను దర్శించుకున్నారు. వారికి దేవస్థానం నిర్వాహకులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చలువ పందిళ్లు వేశారు. ఎండకు రోడ్డుకు నీరు వదులుట వంటివి చేశారు. శివరాత్రి సందర్భంగా నిర్వహించే శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ కల్యాణ మహోత్సవాలలో భాగంగా మూడో రోజైన శనివారం స్వామి మోహినీ అలంకారంలో పురవీధులలో విహరించారు. భక్తులు దర్శించుకుని తన్మయులయ్యారు. నామసంకీర్తనలు, భజనలు, హరికథ, రాత్రి నంది ఉత్సవం నిర్వహించారు. మఠం ఫిట్‌పర్సన్ సి.శంకరబాలాజీ పర్యవేక్షణలో మేనేజర్ ఈశ్వరాచారి ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టారు.

బ్రహ్మంగారి సన్నిధిలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్

శ్రీపోతులూరు వీరబ్రహేంద్రస్వామిని శనివారం రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పవిత్ర, ఆమె భర్త మురళీకృష్ణ, కుమారుడు స్వామిని దర్శించుకున్నారు. స్థానిక మఠం నివాసి విశ్వబ్రాహ్మణ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గొడ్లవీడు సుబ్రమణ్యం ఆచారి వారికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు జగన్‌మోహనాచారి, ఎంపీటీసీ మనోహరాచారి, బి.మఠం మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ప్రతాపాచారి, పూర్వపు మఠాధిపతి సోదరుడు వీభద్రస్వామి, పూర్వపు మఠాధిపతి రెండవ కుమారుడు భద్రయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.


మోహినీ అలంకారంలో వీరబ్రహ్మేంద్రుడు


బి.మఠంలో భక్తుల సందడి

శ్రీఈశ్వరీదేవి మఠంలో..

జగన్మాత శ్రీ ఈశ్వరీదేవి మఠంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన శనివారం శ్రీ పార్వతీపరమేశ్వరుల కల్యాణమూర్తుల గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి శ్రీ ఈశ్వరీదేవి సింహ వాహన గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మఠాధిపతి శ్రీ వీరశివకుమారస్వామి పర్యవేక్షణలో ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టారు. అలాగే పొలతల భక్తులు శ్రీ ఈశ్వరీదేవి మఠంలో అమ్మవారిని దర్శించుకున్నారు.

క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహస్వామికి మాఘమాసం ఐదవ చివరి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుండే అభిషేకం నిర్వహించి భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుండి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి కాయకర్పూరం సమర్పించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు.

ముగిసిన మల్లెంకొండేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో మల్లెంకొండేశ్వరస్వామి


గోపవరం : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించిన మల్లెంకొండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. వైఎస్సార్ జిల్లాతో పాటు నెల్లూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల నుంచి భక్తులు బ్రహ్మోత్సవాలకు పెద్ద ఎత్తున రావడం జరిగింది. శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున కొండపైన స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ గోవిందరెడ్డి, ఈవో శివయ్య కొండపైన అన్ని వసతులు సమకూర్చారు. దాతల సాయంతో తాగునీరు, అన్నదానం ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా బ్రహ్మోత్సవాలు ముగిశాయి. అన్నిశాఖల అధికారులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు.

మజ్జిగ, మంచినీరు పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న నాగేంద్ర, వీరయ్య

పోరుమామిళ్ల : రంగసముద్రం ఉపసర్పంచ్ రుద్రవరం నాగేంద్రప్రసాద్ శనివారం మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. శివరాత్రి జాగరణకు పొలతల, లంకమల, నిత్యపూజయ్య కోన, హత్యరాల, బ్రహ్మంగారిమఠం తదితర క్షేత్రాలకు వెళ్లి తిరిగివస్తున్న భక్తులకు అంబేద్కర్ సర్కిల్‌లో చల్లని మజ్జిగ, మంచినీరు అందించారు. ఉదయం 7 గంటల నుండే ఎండ విపరీతంగా కాస్తుండటంతో క్షేత్రాలకు వెళ్లి వస్తున్న భక్తులకు కొంత ఊరటనిచ్చేందుకు, ఎండ తాపాన్ని తగ్గించేందుకు ఉడతాభక్తిగా తనవంతు సహాయంగా వారికి మజ్జిగ ఇచ్చారు.

సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ


ప్రతిభ కనపరచిన విద్యార్థులతో వేదవ్యాస డిగ్రీ కళాశాల యాజమాన్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక నెహ్రూరోడ్డులోని వేదవ్యాస డిగ్రీ కళాశాల విద్యార్థులు సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ కనపరచారు. మొదటి సెమిస్టర్ బీఎస్సీ కంప్యూటర్‌సైన్స్ విద్యార్థులు ప్రణీత, గౌస్‌బీ, ఆదిత్యవర్ధన్, సాజిద్‌హుస్సేన్, మన్వితరెడ్డి, సాజిదా రెహమానిలు 10కి 10 జీపీఏ సాధించారు. బీకాంలో సోనియా 9.5, మూడో సెమిస్టర్ ఎంపీసీఎస్‌లో నాగసుష్మిత 9.5, మీనా 9.3, చాంద్‌బీ 9.1 ఎంఎస్‌సీఎస్‌లో అనూష 8.9, జ్యోతి స్వరూప్ 8.8, బీకాంలో అతిఫాభాను 8.8, వినీత 8.6, ఐదో సెమిస్టర్ ఎంపీసీఎస్‌లో మౌనిక 9.1, లలిత, 9.0, ఎంఎస్‌సీఎస్‌లో చంద్రిక 9.1, దీక్షిత 8.7 బీకాంలో శ్రీదేవి 8.6, ధరణి 8.5 జీపీఏ సాధించారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఎల్.నాగేశ్వరరెడ్డి, అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రామలక్ష్మిరెడ్డి, నాగరాజు, అధ్యాపకులు అభినందించారు.

ఆలయంలో చోరీ

చాపాడు : మండలంలోని అన్నవరం గ్రామ పంచాయతీలోని చెండ్లూరు గ్రామంలోని రామలింగ చౌడేశ్వరీదేవి దేవస్థానంలో గురువారం రాత్రి ఆలయంలోని హుండీని గుర్తు తెలియని దొంగలు దోచుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. హుండీలో రూ.30 వేలకుపైగా నగదు ఉంటుందని ప్రతి ఏడాది మే నెలలో హుండీని లెక్కిస్తామని ఈ ఏడాది మార్చిలోనే దొంగతనం జరిగిందని దీనిపై విచారణ చేసిన దొంగలను పట్టుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

అల్లాడుపల్లెలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

చాపాడు : మండలంలోని ముఖ్య పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం వద్ద గత పది రోజులుగా జరుగుతున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. మహా శివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఆలయంలో వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదే క్రమంలో శనివారం సాయంత్రం బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి వారిని అశ్వవాహనంపై అల్లాడుపల్లె వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.


అల్లాడుపల్లెలో అశ్వవాహనంపై వీరభద్రస్వామి దంపతుల ఊరేగింపు

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే

పోరుమామిళ్ల : మీకు మేలు చేసిన పార్టీకే ఓటు వేయాలని, జగనన్నతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ అన్నారు. శనివారం రాత్రి మండలంలోని చిన్నాయపల్లె, అగ్రహారం గ్రామాల్లో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి, పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డిలతో కలసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వారివెంట జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ రాజశేఖర్, సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి, యువనేత చాపాటి సాయి నారాయణరెడ్డి, పంచాయతీ నాయకులు పాల్గొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ జగనన్న మేలు చేశారని, గ్రామ స్వరాజ్యం ఇంతకాలం వినడమే కానీ దాన్ని ఆచరణ చేసిన ఘనత జగనన్నకే చెందిందన్నారు. మారుమూల గ్రామాల్లో సచివాలయాల ఏర్పాటుతో ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కారమవుతున్నాయన్నారు. చంద్రబాబు హయామంతా అబద్ధాలతోనే గడిచిందన్నారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం బాగుపడుతుందన్నారు.


చిన్నాయపల్లె ప్రచారంలో ఎమ్మెల్యే సుధ, విజయప్రతాప్‌రెడ్డి

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించండి

కలసపాడు : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అన్నారు. శనివారం మండలంలోని ఎగువ రామాపురం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్ళి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వేయించి వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి వైఎస్‌అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు అంకనగురివిరెడ్డి, సూదా రామకృష్ణారెడ్డి, సుదర్శన్‌లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందజేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇంత మంచిపాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిత్తారాజశేఖర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, నారాయణయాదవ్, భాస్కర్‌రెడ్డి, సింగరయ్య, అంకిరెడ్డి, సురేష్‌యాదవ్, బాలుడుయాదవ్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.


ఎగువ రామాపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

లబ్ధిదారులకు ఇంటి స్థలాలపై సర్వహక్కులు

బద్వేలు అర్బన్ : జగనన్న కాలనీల్లో ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులకు పైసా ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేసి సర్వహక్కులు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, 5వ వార్డు ఇన్‌చార్జి సింగసానిశివయ్య పేర్కొన్నారు. 5వ వార్డులో 210 మంది లబ్ధిదారులకు శనివారం రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పంపిణీ చేసిన ఇంటి స్థలాలకు కేవలం మాత్రమే డిపట్టా మాత్రమే అందజేసేవారని, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారుల పేరిట సర్వహక్కులతో రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేసి చరిత్ర సృష్టించారన్నారు. ఈ పట్టాల ద్వారా బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుండి రుణాలు పొందే అవకాశం కలుగుతుందని అన్నారు. పేదల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలిచి మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ సుజాతకృష్ణ, యువజన విభాగం నాయకులు సింగసానిరాజేష్, వార్డు నాయకులు సిద్దయ్య, చంద్ర, ప్రవీణ్, వెంకటసుబ్బయ్య, లక్ష్మీనారాయణ, గృహ సారథులు పాల్గొన్నారు.


రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు శివయ్య

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు


అల్లాడుపల్లెలో జన సందోహం నడుమ బండలాగుతున్న ఎడ్లు

చాపాడు : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో శనివారం జన సందోహం నడుమ జరిగిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీలలో అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెందిన రమేష్ ఎద్దు 1680 అడుగులతో ప్రథమ స్థానంలో నిలువగా, వైఎస్సార్ జిల్లా వల్లూరు మండలం బాలాయపల్లెకు చెందిన రమణారెడ్డి ఎద్దు 1585 అడుగులతో ద్వితీయ, నంద్యాల జిల్లా పీఆర్‌పల్లెకు చెందిన నాగయ్య ఎద్దు 1468 అడుగులతో తృతీయ, ప్రొద్దుటూరు మండలం చౌటపల్లెకు చెందిన చంద్ర ఓబుళరెడ్డి ఎద్దు 1452 అడుగులతో నాలుగవ, అనంతపురం జిల్లా యాడికికి చెందిన చెన్నప్ప ఎద్దు 1354 అడుగులతో ఐదవ, ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీకి చెందిన గురివిరెడ్డి ఎద్దు 1251 అడుగులతో ఆరవ, ఎం.రమేష్‌కు చెందిన ఎద్దు 1205 అడుగులు బండలాగి ఏడవ స్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎద్దుల ఎజమానులకు ఎంపీపీ లక్షుమయ్య, ఆలయ చైర్మన్ జీవై వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ కిషోర్‌కుమార్‌రెడ్డిల చేతుల మీదుగా వరుసగా కమలాపురం మండల కుప్పూరు వారిపల్లెకు చెందిన లక్ష్మణరెడ్డి రూ.1,00,116, లక్ష్మీపేట నారాయణరెడ్డి రూ.70,116, అల్లాడుపల్లె రజకుల సంఘం, చెన్నూరు జ్యూవెలర్స్ వారు రూ.60,116, చియ్యపాడు కాత్యాయని కన్‌స్ట్రక్షన్ ఎండీ పీవీ రమణారెడ్డి రూ.40,116, బీ.మఠం రవీంద్రనాథ్‌రెడ్డి రూ.20,116, నరహరిపురం పి. చిన్నవీరారెడ్డి కుటుంబీకులు రూ.12,116, కోడూరు వెంకటేష్ కుటుంబీకులు రూ.5,116 అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ సింగిల్ విండో వేమారెడ్డి, రాజేష్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ప్రథమ స్థానంలో నిలిచిన ఎద్ల యజమానికి బహుమతి అందజేస్తున్న ఎంపీపీ, ఆలయ చైర్మన్

మూడు పార్టీలది అపవిత్ర కలయికే

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలది అపవిత్ర కలయికేనని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు ఇన్‌చార్జి హిదాయత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సతీమణి రాచమల్లు రమాదేవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీని 2019 ఎన్నికల సందర్భంగా అనేక రకాలుగా చంద్రబాబు దూషించారన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేశారని, రాష్ట్రంలో అడుగు పెట్టనివ్వబోమని మోదీని విమర్శించారన్నారు. మోదీని వ్యతిరేకిస్తూ చంద్రబాబు రాష్ట్ర వ్యాప్తంగా ధర్మ పోరాట సభలను నిర్వహించడాన్ని ప్రజలు మరిచిపోలేదన్నారు. జనసేన నాయకుడు పవన్‌కళ్యాణ్ చంద్రబాబు, లోకేష్‌ను తీవ్రంగా విమర్శించారన్నారు. కేవలం స్వార్థ రాజకీయాల కోసం ప్రస్తుతం చంద్రబాబు అటు బీజేపీ, జనసేన పార్టీ పొత్తులు చేసుకున్నారని తెలిపారు. ఒకరిపై ఒకరికి నమ్మకం, విశ్వాసం లేదని, వీరి కలయిక అనైతికమని, రాజకీయ ప్రయోజనాలే పరమావధిగా పొత్తులు పెట్టుకున్నారని విమర్శించారు. 22వ వార్డులో 99 శాతం పేద ప్రజలు నివసిస్తున్నారని, వీరికి రూ.40 కోట్ల మేరకు సంక్షేమ పథకాల రూపంలో అందించామన్నారు. సుమారు రూ.3 కోట్లతో వార్డులో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలను నిర్మించామన్నారు. వార్డులో ఎక్కవ శాతం ముస్లిం మైనారిటీలే నివసిస్తున్నారని, వారంతా వైఎస్సార్‌సీపీకి ఏకపక్షంగా మద్దతు ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో 22వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు హాజీపీరా, సుభాన్ బాషా, ఫరీద్, కోఆప్షన్ మెంబర్ జాఫర్, క్లాసిక్ జాఫర్, వేంపల్లి గౌస్, అబ్దుల్, కరీముల్లా, షాలిమార్ సలీం, జబ్బార్, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిసెట్టి బాబు, కౌన్సిలర్లు ఖలీల్, కమాల్, కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున ప్రసాద్, నగర కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పర మురళి, వడ్ల దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

గోపవరం, కొత్తపల్లె పంచాయతీల్లో..

మండలంలోని గోపవరం, కొత్తపల్లె పంచాయతీల్లో కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేస్తున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. గోపవరం పంచాయతీలోని యానాది కాలనీ వద్ద ఉన్న క్రైస్తవుల సమాధుల తోటలో రూ.20 లక్షలతో జరుగుతున్న కల్వర్టు పనులను, డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం భగత్‌సింగ్‌కాలనీలోని ఐదు వీధుల్లో రూ.1.70 కోట్లతో జరుగుతన్న డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులను, హౌసింగ్ బోర్డులో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను, కొత్తపల్లె గ్రామ పంచాయతీ ప్రకాష్ నగర్‌లో రూ.3 కోట్లతో జరుగుతున్న డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రెండు గ్రామ పంచాయతీల్లో సమస్యలు పేరుకుపోయాయన్నారు. కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ సమస్యల పరిష్కారం కోసమే కోట్ల రూపాయాలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ ఓబయ్య యాదవ్, మాజీ సర్పంచ్ దేవీప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండన్న, గోకుల మేరి, ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.కోట్ల సీఎంఆర్‌ఎఫ్ నిధుల మంజూరు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు గత ఐదేళ్లలో కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నిధులు మంజూరు చేయించానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని 27 మందికి రూ.34.36 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం మున్సిపల్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్య శ్రీ పరిధిలో 3,555 జబ్బులను చేర్చిందని తెలిపారు. వైద్యం కోసం రూ.25 లక్షలు మంజూరు చేస్తోందన్నారు. ఆరోగ్యశ్రీలో లేని జబ్బులకు మాత్రమే సీఎంఆర్‌ఎఫ్ వర్తిస్తుందని పేర్కొన్నారు. వైద్య చికిత్స అనంతరం ప్రజలు ఇచ్చిన బిల్లులను తాను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పంపి నిధులు మంజూరు చేయించానని చెప్పారు. సీఎంఆర్‌ఎఫ్ పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్య సంజీవని అన్నారు.

ఒక్కరికే రూ.10 లక్షలు మంజూరు

ఈ సందర్భంగా ముక్కమళ్ల మాధురికి రూ.10 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అందించారు. మాధురికి కవలలు జన్మించగా ఇందులో ఓ చిన్నారికి పేగుకు సంబంధించిన ఆపరేషన్ చేయించుకుని బిల్లులు సమర్పించగా సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరు చేశారని ఎమ్మెల్యే తెలిపారు. వెంగళాయపల్లె సర్పంచ్ రేణుకమ్మ కుమారుడు కిరణ్‌కుమార్‌రెడ్డి ద్వారా ఎమ్మెల్యేను ఆశ్రయించగా.. నిధులు మంజూరు చేయించారని ఈ సందర్భంగా మాధురి తెలిపారు. తనకు చెక్కు మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డితోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవికి ఆమె పూలమాల వేసి సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జిలాన్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు భూమిరెడ్డి నాగార్జునరెడ్డి, పర్లపాడు మధుసూదన్‌రెడ్డి, 19వ వార్డు ఇన్‌చార్జి చాంద్, దొరసానిపల్లె ఉపసర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో వైభవంగా ఊంజల్‌సేవ


ఊంజల్ సేవలో స్వామి, అమ్మవార్లు

పోరుమామిళ్ల : పట్టణంలోని పురాతన శివాలయం బాలాత్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామి వారి ఊంజల్‌సేవ అత్యంత వైభవంగా జరిగింది. దియ్యాల శ్రీనివాసులు-మంజుల దంపతులు శనివారం రాత్రి ఊంజల్ సేవా కార్యక్రమం నిర్వహించారు.ఆలయ అర్చకులు మధుశర్మ ఊంజల్‌సేవ కార్యక్రమాన్ని శాస్త్రబద్ధంగా ఆచరింపచేశారు. శుక్రవారం శివరాత్రి ఉత్సవాలు ముగియడంతో శనివారం గుడి ప్రదక్షణ, రాత్రి ఊంజల్ సేవతో ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సత్యనారాయణ రెడ్డి, గౌరవ అధ్యక్షులు తులసి సుధాకర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఊసరవెల్లి రాజకీయాలను ముస్లింలు నమ్మొద్దు

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : చంద్రబాబు ఊసరవెల్లి రాజకీయాలను ముస్లింలు నమ్మొద్దని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక నంద్యాల రోడ్డులోని ముస్లింల ప్రార్థనా స్థలం ఈద్గా నూతన ప్రహరీ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు 2014 ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకున్నారని, 2019లో మోదీతో విభేదించి కాంగ్రెస్‌తో జతకట్టారని గుర్తు చేశారు. అధికారంలో ఉండగా ముస్లింలకు అది చేస్తాం, ఇది చేస్తామంటూ ఎన్నో హామీలు ఇచ్చి, ఏమీ చేయలేదని ఆరోపించారు. చంద్రబాబు అవినీతి చాలా ఉందన్నారు. ఇటీవల జైలుకు వెళ్లాడన్నారు. చంద్రబాబు అవినీతి ఇంకా ఉందని ఆ విషయంలో మళ్లీ జైలుకు పోతానేమోనని భయంతోనే ఇప్పుడు మళ్లీ బీజేపీతో పొత్తు పెట్టుకుంటున్నాడని ఆరోపించారు. ముస్లింలకు మేలు చేసింది వైఎస్ కుటుంబం మాత్రమే అన్నారు. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత వైఎస్ కుటుంబానిదేనన్నారు. ముస్లింలు వైఎస్ కుటుంబాన్ని మరిచిపోరని వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్ వెంటే ఉంటారని తెలిపారు.


ఈద్గా ప్రహరీ నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

రూ.25.50 లక్షలతో ప్రహరీ

మైదుకూరులో రూ.25.50 లక్షలతో ఈద్గా ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. నిర్మాణానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కలెక్టర్ విజయరామరాజు సహకారంతో నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఏప్రిల్ 11న రంజాన్ పండుగ నాటికి ప్రహరీ పూర్తి చేయిస్తామన్నారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మదీనా దస్తగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, ఖాజీపేట ఎంపీపీ అబూబకర్ సిద్ధిక్, మున్సిపల్ వైస్ చైర్మన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతతకు భంగం కలిగిస్తే చర్యలు

జమ్మలమడుగు : నియోజకవర్గంలో ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ టీడీ యశ్వంత్ తెలిపారు. శనివారం పట్టణంలోని పురవీధులలో సీఆర్‌పీఎఫ్ దళాలతో ఆయన కవాతు నిర్వహించి మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతంగా ఓటింగ్‌లో పాల్గొనే విధంగా అన్ని చర్యలను చేపట్టామన్నారు. సమస్యలను సృష్టించిన వారిపై వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే నియోజకవర్గ పరిధిలోని సమస్యలు సృష్టించేవారిపై, రౌడీషీటర్లపై ఆయా స్టేషన్‌ల పరిధిలో ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.


పట్టణంలో కవాతు చేస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు

చెన్నూరులో..

చెన్నూరు : రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని స్థానిక వీధుల్లో శనివారం కేంద్ర బలగాలు సీఐ పార్థసారథి ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ప్రజలు ప్రశాంతంగా ఓటింగ్‌లో పాల్గొనే విధంగా అన్ని చర్యలను చేపట్టామన్నారు. ఎన్నికల్లో సమస్యలు సృష్టించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.